ఎకరాకు రూ. వెయ్యి చొప్పున..

జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం కోసం అరకు పార్లమెంట్ వైసీపీ అధ్యక్షుడు పరీక్షిత్ రాజు 2022, ఫిబ్రవరి 8న దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించారు. 2022, ఏప్రిల్ 23న బెలగాంలోని సర్వేనెంబర్ 458 రెండో భాగంలో ఎకరా 18 సెంట్లు కేటాయించారు. ఏడాదికి ఎకరాకు రూ.వెయ్యి చొప్పున లీజు రూపంలో చెల్లించే విధంగా స్థలాన్ని వైసీపీకి కట్టబెట్టారు. జిల్లా పరిషత్‌కు చెందిన ఈ స్థలాన్ని ముందుగా 33 సంవత్సరాలకు అగ్రిమెంట్ ఆ తర్వాత దానిని 99 సంవత్సరాలకు పొడిగించుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా కేంద్రంలో వైసీపీ కార్యాలయం నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరాయి.



అడ్డగోలుగా...

- ఇంద్ర భవనాన్ని తలపించేలా వైసీపీ కార్యాలయం
- ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు
- చివరి దశకు పనులు.. పట్టని అధికార యంత్రాంగం



పార్వతీపురం, జూన్ 23(ఆంధ్రజ్యోతి): ఇంద్రభవనాన్ని తలపించే విధంగా ఉన్న ఈ భవనం చూసి.. ఇదేదో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, ఉన్నతాధికారుల క్యాంపు ఆఫీసు అనుకుంటే పొరబడినట్టే. ఇది జిల్లా కేంద్రం పార్వతీపురంలో వైసీపీ ప్రధాన కార్యాలయం. ఎటువంటి అనుమతులు లేకుండానే దీని నిర్మాణం చేపట్టారు. దాదాపు పనులన్నీ పూర్తయ్యాయి. ప్రభుత్వ స్థలాలను వైసీపీ సొంతంగా భావించి కోట్లాది రూపాయలతో నిర్మాణం చేపట్టింది. దశాబ్దాలుగా రాజకీయ క్షేత్రంలో ఉన్న టీడీపీతో పాటు వివిధ పార్టీలకు పార్వతీపురంలో సొంత కార్యాలయం లేదు. కానీ వైసీపీ మాత్రం బరితెగించింది. గత ఐదేళ్లలో ప్రజా సమస్యలను పక్కన పెట్టి.. ఎటువంటి అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టింది. దీనిపై అధికారులు స్పందించకపోవడంపై జిల్లాకేంద్రవాసులు మండిపడుతున్నారు.

అనుమతులు లేకుండానే...

ఎటువంటి అనుమతులు లేకుండానే వైసీపీ తన పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని ప్రారంభించింది. వాస్తవంగా జిల్లా కేంద్రంలో ఉన్న మున్సిపాలిటీ లేదా బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా గానీ అనుమతులు పొందాల్సి ఉంది. కానీ ఆ పార్టీ నాయకులు అలా చేయలేదు. తమ అధికారాన్ని అడ్డు పెట్టుకుని.. అనుమతులు తీసుకోకుండానే భవనం పనులు ప్రారంభించారు.

కళ్లుమూసుకున్న అధికారులు...

పట్టణాల పరిధిలో చిన్నరేకుల షెడ్ వేసుకుంటేనే.. అనుమతులు ఉన్నాయా? లేదా! అంటూ సామాన్యులను నిలదీసే మున్సిపల్ అధికారులు వైసీపీ కార్యాలయ భవన నిర్మాణంపై స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా ఆ పార్టీ నేతలు పనులు చేపట్టినా.. అధికారులు మిన్నకుండి పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మొత్తంగా వారు తమకేమీ పట్టనట్టుగా కళ్లుమూసుకొని ఉండిపోయారు. భవన విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో తమ పరిధిలోకి వచ్చే పరిస్థితి లేదని, బహుశా బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ నుంచి అనుమతులు పొంది ఉంటారని మున్సిపల్ అధికారులు చెబుతుండడం గమనార్హం. వైసీపీ అధికారంలోకి లేకపోయినప్పటికీ కొంతమంది సిబ్బంది ఇప్పటికీ ఏ విధంగా తమ స్వామిభక్తిని చాటుకుంటున్నారో ఈ వ్యాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చు. మున్సిపాలిటీ పరిధిలో ఇంద్రభవనంలా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణం జరుగుతుండగా.. దానికి సంబంధించిన అనుమతులు ఉన్నాయా? లేవా! అని తెలుసుకోలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. మొత్తంగా గత ఐదేళ్లలో అటువంటి వారు వైసీపీ సేవలో ఎలా తరించారో అర్థం చేసుకోవచ్చు.



ఎటువంటి అనుమతులు లేకుండా పార్వతీపురంలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం

మా నుంచి అనుమతులు పొందలేదు

వైసీపీ కార్యాలయం భవన నిర్మాణానికి సంబంధించి టౌన్ ప్లానింగ్ కార్యాలయం నుంచి ఎవరూ ఎటువంటి అనుమతులు పొందలేదు. ఆ భవనం విస్తీర్ణం ఎక్కువగా ఉండడం వల్ల బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ కార్యాలయం ద్వారా అనుమతులు పొంది ఉండొచ్చు.

- పీకే రావు,
పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి,
పార్వతీపురం



శంబర గ్రామం

- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్వీర్యం
- నిధులు లేక అభివృద్ధి శూన్యం
- కొత్త సర్కారుపైనే ఆశలు పెట్టుకున్న సర్పంచ్‌లు

పంచాయతీల దశ మారేనా?

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. వలంటీరు వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. పేరుకే సర్పంచ్‌లు గానీ ఎలాంటి అధికారాలు ఉండేవి కావు. మరోపక్క నిధులు సైతం లేక పంచాయతీలు అచేతన స్థితికి చేరుకున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ పంచాయతీ కూడా అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం పారిశుధ్య పనులు, వీధి దీపాల నిర్వహణకు కూడా నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లాలో 451 పంచాయతీలు ఉన్నాయి. అధికశాతం సర్పంచ్‌లు వైసీపీ మద్దతుదారులే. ఈ పంచాయతీల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టేందుకు జగన్ సర్కారు నిధులు మంజూరు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15 ఆర్థిక సంఘాల నిధులను సైతం ఇతర అవసరాలకు దారిమళ్లించి పంచాయతీలకు తీవ్ర అన్యాయం చేసింది. ఫలితంగా కొన్ని పంచాయతీలు పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించుకోలేని దీనస్థితికి చేరుకున్నాయి. వేతనాల కోసం కార్మికులు నిరసన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం శూన్యం. రక్షిత పథకాలు, బోర్లు, వీధి దీపాలు మరమ్మతులకు గురైతే వాటిని బాగు చేయించుకోలేని దుస్థితి ఏర్పడింది. మురుగు కాలువల్లో పూడికలు తీసే పరిస్థితి కూడా చాలా పంచాయతీల్లో లేదు. దీంతో ప్రజలు సర్పంచ్‌లను నిలదీసిన ఘటనలు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు కూడా కట్టలేని పరిస్థితి. గత ఐదేళ్ల జగన్ పాలనలో ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు లేవు. ఆశించిన స్థాయిలో ఆదాయ మార్గాలు లేవు. దీనికితోడు సచివాలయాల నిర్వహణ పంచాయతీలకే అప్పగించారు. పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేయడానికి కూడా అభ్యంతరాలు తెలిపింది. కాంప్రహెన్సివ్ ఫైనాన్సియల్ మేనేజిమెంట్ సిస్టమ్ (సీఎంఎఫ్ఎస్)ను తెరపైకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను సైతం వివిధ పద్దుల కింద ప్రభుత్వ శాఖల బకాయిలకు మళ్లించింది. దీంతో గ్రామాల్లో కీలకమైన పారిశుధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో తాము ఎందుకు పంచాయతీ సర్పంచ్‌లుగా ఎన్నికయ్యామా? అని చాలామంది సర్పంచ్‌లు బాధపడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపైనే సర్పంచ్‌లు ఆశలు పెట్టుకున్నారు. సర్పంచ్‌లకు అధికారాలతో పాటు పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టడంతో పంచాయతీలకు మంచిరోజులు వస్తాయని సర్పంచ్‌లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత సర్కారు పట్టించుకోలేదు..

ఐదేళ్లు మా పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పంచాయతీల గురించి పట్టించుకోలేదు. మాకు అధికారాలు లేకుండా చేసింది. నిధులు కూడా ఇవ్వలేదు. కొత్త ప్రభుత్వంపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక నిధులు మంజూరు చేస్తారని ఆశిస్తున్నాం.

-ఓ వైసీపీ సర్పంచ్

న్యాయం జరుగుతుందని..

టీడీపీ కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తారని ఎంతో ఆశతో ఉన్నాం. వైసీపీ ప్రభుత్వ కాలంలో పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదు.

- వంగపండు లక్ష్మి, టీడీపీ సర్పంచ్,
ఎం.ఆర్.నగరం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

పార్వతీపురం, జూన్23 (ఆంధ్రజ్యోతి)/ సీతంపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పేరిట ఇకపై ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నేడు జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నూతన సర్కారు ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్న నేపథ్యంలో ఇప్పటికే కలెక్టరేట్, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, జేసీ శోభిక, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ ఇతర శాఖల అధికారులు పాల్గొనున్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ పేరిట ప్రజల నుంచి వినతి పత్రాల స్వీకరించాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే నూతన సర్కారు స్పష్టం చేసింది. ఇక సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో గిరిజనులు తమ సమస్యలపై వినతులు అందజేయాలని ఏపీవో ఎస్.వెంకట్ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజర్వాలని ఆదేశించారు.

ఇంకా అందలే..

- రెన్యువల్ ఆర్డర్ల కోసం కాంట్రాక్టు లెక్చరర్ల ఎదురుచూపు

జియ్యమ్మవలస: ఇంటర్మీడియట్ విద్యా బోధనలో కీలకమైన కాంట్రాక్టు లెక్చరర్లకు ఇంకా రెన్యువల్ ఆర్డర్లు అందలేదు. దీంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రోజులు గడుస్తున్నా.. ఇంకా లెటర్లు అందకపోవడంతో వాటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వాస్తవంగా గత ప్రభుత్వం వారిని మోసం చేసింది. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత వైసీపీ సర్కారు ఎన్నికల ముందు మాటిచ్చింది. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల కనీసం వారిని పట్టించుకోలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంపై కాంట్రాక్టు , గెస్ట్ లెక్చరర్లు గంపెడాశలు పెట్టుకున్నారు. జిల్లాలో పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో 15 మండలాలు ఉన్నాయి. వాటిల్లో గరుగుబిల్లి, సీతంపేట మినహా 13 మండలాల్లో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో 178 మంది లెక్చరర్లు పనిచేస్తున్నారు. వారిలో రెగ్యులర్ లెక్చరర్లు కేవలం 31 మంది మాత్రమే. మిగిలిన 131 మంది కాంట్రాక్టు ప్రాతిపదికపైన విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఏడుగురు గెస్ట్ లెక్చరర్లు, ఒకరు మినిమం టైమ్ స్కేల్ లెక్చరర్‌గా ఉన్నారు. కాగా 138 మంది రెన్యువల్ లెటర్లు కోసం ఎదురు చూస్తున్నారు. వాస్తవంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. అయితే నేటికీ వారికి రెన్యువల్ లెటర్లు అందలేదు. ఇప్పటికే ఇతర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెన్యువల్ చేయడంతో కాంట్రాక్టర్ల లెక్చరర్లు టెన్షన్ పడుతున్నారు. గతంలో వారికి కళాశాలలు పునఃప్రారంభమైన పది రోజుల్లో రెన్యువల్ లెటర్లు అందేవి. మిగిలిన రోజులకు వీరికి జీతాలు అందేవి. కానీ ఈ ఏడాది ఇంకా రెన్యువల్ లెటర్లు అందకపోవడంతో ఈ నెల జీతం వస్తుందా? రాదా? అనే సందిగ్ధంలో వారున్నారు. డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. కాగా జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లకు ఒకట్రెండు రోజుల్లో రెన్యువల్ లెటర్లు ఇస్తామని డీవీఈవో డి.మంజులవీణ తెలిపారు.



చినమేరంగి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ (ఫైల్)

నాలుగున్నరేళ్లలో.. 23 శాతమే..

- ఇదీ తోటపల్లి కాలువల ఆధునికీకరణ తీరు
- పనులపై నిర్లక్ష్యం వహించిన గత వైసీపీ సర్కారు
- ఈ ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకమే...
- టీడీపీ కూటమి ప్రభుత్వం పైనే రైతుల ఆశలు

పాలకొండ, జూన్ 23: పార్వతీపురం మన్యంతో పాటు శ్రీకాకుళం జిల్లాల్లో వేలాది ఎకరాలకు జీవనాధారమైన తోటపల్లి జలాశయంపై గత వైసీపీ సర్కారు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిధులు మంజూరులోనూ చేతులెత్తేసింది. అన్నదాతల గోడును పట్టించుకోలేదు. తోటపల్లి పూర్వపు ఎడమ, కుడి కాలువల ఆధునికీకరణపై దృష్టి సారించలేదు. రివర్స్ టెండర్లతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే జరిగిన పనులను రద్దు చేసింది. మొత్తంగా నాలుగున్నరేళ్లలో కేవలం 23 శాతం మేర పనులే పూర్తయ్యాయంటే గత వైసీపీ ప్రభుత్వం ఏ మేరకు శ్రద్ధ వహించిందో అర్థం చేసుకోవచ్చు. సాగునీటి కాలువల ఆధునికీ కరణ పనులు కొలిక్కి రాకపోవడంతో రెండు జిల్లాల పరిధిలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఖరీఫ్‌లోనూ సాగునీటి కష్టాలు తప్పేలా లేవని మథనపడుతున్నారు. ప్రస్తుతం వారంతా నూతన ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

గత టీడీపీ ప్రభుత్వం హయాం (2018)లో తోటపల్లి జలాశయం కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు రూ.193 కోట్లు విడుదలయ్యాయి. టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించారు. అయితే ఆ తర్వాత ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. 25 శాతం కంటే తక్కువ జరిగిన పనులు నిలిపివేయాలని గత వైసీపీ సర్కారు ఆదేశాలు ఇచ్చింది. దీంతో 2020లో పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత 2021-22లో అరకొరగానే పనులు జరిగాయి. గత ఏడాది డిసెంబర్‌లో పనులు పునఃప్రారంభం కావాల్సి ఉన్నా కాంట్రాక్టర్ చేపట్టలేదు.

- గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ, బూర్జ మండలం వరకు విస్తరించి ఉన్న ఎడమ కాలువలో 37.62 కిలోమీటర్లకు గాను 16 కిలోమీటర్లు, గరుగుబిల్లి, బలిజిపేట, వంగర మండలాలో విస్తరించి ఉన్న కుడి కాలువలో 16 కిలోమీటర్లు గాను 9.37 కిలోమీటర్ల మేర కాంక్రీట్ లైనింగ్ పనులు జరిగాయి.
- ఎడమ కాలువ పరిధిలో 8 బ్రాంచిలు, కుడి కాలువ పరిధిలో 11 బ్రాంచి కాలువల నిర్మాణం జరగాల్సి ఉంది. వీటితో పాటు 267 వరకు అక్విడెక్టులు, సూపర్ పాసేజ్‌లు, అండర్ టన్నెళ్లు, అవుట్ లెట్లు, డ్రాప్‌లు, ఓటీ స్లూయిజ్‌లు నిర్మించాల్సి ఉంది.
- 2019, మే వరకు రూ.14 కోట్లతో 9 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత రూ.40 కోట్లతో గత వైసీపీ సర్కారు నాలుగున్నరేళ్లలో 23 శాతం మాత్రమే పనులు పూర్తి చేసింది. అయితే మొత్తంగా 32 శాతం మేర నిర్మాణాలే పూర్తయ్యాయి.

పనులు సాగవు.. నీరు రాదు..

గత ఏడాది ఖరీఫ్ అనంతరం తిరిగి ఆధునికీకరణ జరగాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడలేదు. మరోవైపు రబీకి సైతం సాగునీటిని అధికారులు అందించలేకపోయారు. దీంతో చాలా మంది రైతులు రబీలో సాగు నిలిపివేశారు.

లస్కర్లు లేక నిర్వహణ శూన్యం...

పాలకొండ డీఈ కార్యాలయం పరిధిలో కాలువల నిర్వహణకు లస్కర్ల కొరత వెంటాడుతుంది. 30 మంది ఉండాల్సి ఉండగా, కేవలం ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కాలువలన్నీ పిచ్చిమొక్కలతో నిండాయి. దీంతో సక్రమంగా నీరు ప్రవహించని పరిస్థితి. గత ఖరీఫ్‌లోనూ రైతులు కొన్ని చోట్ల కాలువల్లో శ్రమదానం చేసి తుప్పలు తొలగించారు. వాస్తవానికి ఏటా ఖరీఫ్‌కు ముందు అధికారులు పూడిక తీయించేవారు. అయితే కొన్నేళ్లుగా ఆ పనులు చేయించడం లేదు.

లక్ష మందికిపైగా సాగు..

తోటపల్లి కుడి, ఎడమ కాలువలు పరిధిలో లక్ష మందికిపైగా రైతులు సాగు చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా 7,544 ఎకరాలు, ఎడమ కాలువ పరిధిలో 32 వేల ఎకరాల్లో సాగు అవుతున్నట్టు అధికారుల లెక్క. వాస్తవంగా ఈ రెండు కాలువల పరిధిలో 65 వేల ఎకరాల వరకు సాగులో ఉన్నట్లు జల వనరుల శాఖాధికారులే చెబుతున్నారు. అయితే ఆయా భూములకు పూర్తి స్థాయిలో నీరందకపో వడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. కాగా టీడీపీ కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తుందని రైతన్నలు విశ్వాసంతో ఉన్నారు. తమ పరిధిలో ఉన్న తోటపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణను పరుగులు పెట్టిస్తారని భావిస్తున్నారు.

రూ.17 కోట్లు బకాయిలు

తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనులకు సంబంధించి సుమారు రూ.17 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనిపై గత వైసీపీ సర్కారు స్పందించకపోవడంతో రబీలో తిరిగి పనులు ప్రారంభం కాలేదు. బిల్లులు వస్తాయో రావోనన్న అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.



తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ఇలా..



పూర్తిగా ధ్వంసమైన షట్టర్

చర్యలు తీసుకుంటున్నాం

తోటపల్లి కుడి, ఎడమ కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. రూ.17 కోట్ల మేర బిల్లులు బకాయిలు ఉన్నాయి.. వాటి చెల్లింపులకు సంబంధించి నూతన ప్రభుత్వానికి నివేదిస్తాం.

- డి.రవికుమార్, డీఈఈ,
జలవనరుల శాఖ, పాలకొండ

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌యూలో ఎమ్మెస్సీ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయోటెక్నాలజీ, కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్-బీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: బయోటెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 12, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు కేటాయించారు.

● కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 6, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓబీసీలకు 4, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 2 సీట్లు నిర్దేశించారు.

అర్హత: ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ)లో ప్రవేశానికి ఫిజికల్, బయలాజికల్(బయోకెమిస్ట్రీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బోటనీ/మైక్రోబయాలజీ/జువాలజీ), అగ్రికల్చరల్, వెటర్నరీ అండ్ ఫిషరీ సైన్సెస్, ఫార్మసీ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ(ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సు) పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

● ఎమ్మెస్సీ(కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్)లో ప్రవేశానికి బేసిక్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

■ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27. ■ **వెబ్‌సైట్:** www.jnu.ac.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఇది అనుబంధ సంస్థ. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీఎస్ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 30
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 8
- **సెల్ఫ్ రిపోర్టింగ్‌కు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** జూలై 20
- **థర్డ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 5
- **ఓరియంటేషన్, రిజిస్ట్రేషన్:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

50వ జీ-7 సమావేశం



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జీ-7 లేదా గ్రూప్ ఆఫ్ సెవెన్.. అనేది ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల కూటమి. తొలుత ఆర్థిక, రాజకీయపరమైన అంశాల్లో పరస్పర సహకారానికి ప్రపంచ ధనిక దేశాలు కూటమిని ఏర్పాటు చేసుకున్నా, కాలక్రమంలో ఈ కూటమి తన లక్ష్యాల పరిధిని పెంచుకుంటూ వస్తోంది. సభ్యదేశాలతోపాటు అవసరార్థం సభ్యేతర దేశాలతో కూడా జట్టుకడుతూ తమ వార్షిక సమావేశాలకు ఆహ్వానించి పరస్పర ప్రయోజన చర్చలకు వేదికవుతోంది. ఈ కోవలో 2003లో మొదలు ఇప్పటివరకూ భారత్ పదకొండుసార్లు ఈ సమావేశాల్లో ఆహ్వానిత దేశంగా పాల్గొంది. 2019 నుంచి వరుసగా ఆహ్వానాన్ని అందుకుంటూనే ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఉభయతారక ప్రయోజనాల కోసం భారత్ ఈ సమావేశాలకు హాజరవుతూ అభివృద్ధి చెందిన దేశాలైన జీ-7 దేశాల సమావేశ వేదికపై తన వాణిని వినిపిస్తూ ఉంది.

తాజాగా జీ-7, 50వ సమావేశం ఇటలీలోని అపూలియా రీజన్‌లో జూన్ 13 నుంచి 15 వరకూ జరిగిన నేపథ్యంలో ఆతిథ్య దేశంగా భారత్ 11వ సారి పాల్గొన్న సందర్భంగా జీ-7 పుట్టుపూర్వోత్తరాలు, ఆతిథ్య దేశంగా భారత్ పాత్ర, ప్రస్తుత సమావేశ ప్రధాన లక్ష్యాలు, చేసిన తీర్మానాలపరంగా ఒక విహంగవీక్షణం చేయాల్సిన అవసరం ఉంది.

జీ-7 ఆవిర్భావం-గమనం



1973 ప్రాంతంలో చమురు ఉత్పత్తి దేశాలు చమురు ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా తగ్గించి, చమురు ధరలు పెరిగేలా చమురు సంక్షోభం(ఫస్ట్ ఆయిల్ క్రైసిస్) సృష్టించాయి. ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలైన ఆరు దేశాలు(అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, వెస్ట్ జర్మనీ, జపాన్) ఒక కూటమిగా(జీ-6)గా 1975లో ఏర్పడ్డాయి. అనంతరం 1976లో కెనడా కూడా ఈ కూటమిలో చేరడంతో జీ-7గా రూపాంతరీకరణ జరిగింది. 1998లో రష్యా కూడా ఈ కూటమిలో చేరడంతో ఇది జీ-8గా రూపొందింది. కానీ, 2014లో రష్యా క్రిమియాను ఆక్రమించడంతో రష్యా జీ-8 సభ్యత్వాన్ని రద్దుచేశారు. దాంతో జీ-8గా తాత్కాలికంగా మారిన ఈ కూటమి తిరిగి జీ-7గా స్థిరపడింది.

ఆహ్వానిత దేశంగా భారత్

జీ-7 విధివిధానాలు, భాగస్వాములు, సమావేశాలు

ఈ జీ-7 కూటమి కేవలం ఒక స్వేచ్ఛాయుత, పరస్పర అంగీకార కూటమి. ఏ ఒప్పందం ద్వారానూ/చార్టర్ ద్వారానూ ఇది ఏర్పడలేదు. అదేవిధంగా సభ్యదేశాలను నియంత్రించే ఎలాంటి చట్టపర కట్టుబాట్లు, వ్యవస్థలు దీనికి లేవు. ఒక ప్రధాన కార్యాలయమంటూ ఏదీలేదు.

అయితే ప్రతి సంవత్సరం జీ-7 సమావేశాలు నిరవధికంగా జరుగుతాయి. దఫాలవారీగా ఒక్కొక్క సభ్యదేశం ఈ సమావేశాన్ని నిర్వహించే బాధ్యత ఒక్కో ఏడాది తీసుకుంటుంది. ఆ ఏడాది సమావేశ ఎజెండా కూడా ఆ ఆతిథ్య దేశమే నిర్ణయిస్తుంది. అదేవిధంగా సంవత్సరం పొడవునా వివిధ రాజకీయ, ఆర్థికపరమైన అవసరాలకు అనుగుణంగా మంత్రులు, అధికారుల స్థాయి సమావేశాలు కూడా జరుగుతూ ఉమ్మడి తీర్మానాలు ప్రకటిస్తుంటాయి.

ఈ జీ-7 సమావేశాల్లో ఏడు సభ్యదేశాలతోపాటు యురోపియన్ యూనియన్, వరల్డ్‌బ్యాంక్(ప్రపంచబ్యాంక్), అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), ఐక్యరాజ్య సమితి కూడా పాల్గొంటాయి.

2003 నుంచి జీ-7 సమావేశాలకు సభ్యేతర దేశాలు కూడా ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల నుంచి ఈ దేశాలను ఆహ్వానించి వివిధ సామాజిక, పర్యావరణ, వ్యాపార అంశాలపరంగా అంతర్జాతీయ సహకారాన్ని ప్రోదిచేయడానికి ఔట్‌రీచ్ సెషన్స్ నిర్వహిస్తారు. జీ-7 సమావేశాలకు సంబంధించిన చర్చనీయాంశాల రూపకల్పనలో, సమావేశానంతర సమీక్షల నిర్వహణల్లో 'షెర్పా'లని పిలిచే పలు దేశాల అధికార గణం(రాయబారులు మొదలైనవారు) కీలకపాత్ర వహిస్తుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)

ముఖ్యాంశాలు తీర్మానాలు

50వ జీ-7 సమావేశాన్ని సభ్య దేశమైన ఇటలీ జూన్ 13 నుంచి 15 వరకూ అపూలియా రీజియన్‌లో గల బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో నిర్వహించింది. 2003 నుంచి అనుసరిస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా సభ్యదేశాలతోపాటు సభ్యేతర దేశాలను కూడా జీ-7 సమావేశ ఔట్‌రీచ్ సెషన్స్‌కు ఆహ్వానించారు. ఆహ్వానం అందుకున్న సభ్యేతర దేశాల్లో భారత్‌తోపాటు అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, జోర్డాన్, కెన్యా, మౌరిటేనియా, ట్యునీషియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ ఉన్నాయి. ఈ దేశాలతోపాటు ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్, ఐక్యరాజ్యసమితి అధిపతులు కూడా ఉన్నారు.

సమావేశ థీమ్, ఎజెండా

ఈ ఏడాది జీ-7 సమావేశపు థీమ్‌ను 'రూల్ బేస్డ్ ఇంటర్నేషనల్ సిస్టమ్'గా, సమావేశానికి ప్రత్యేక ఆహ్వానిత దేశాధ్యక్షుడైన టర్కీ అధ్యక్షుడు 'రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్' నిర్ణయించారు. ఆతిథ్యదేశంగా ఇటలీ ఈ సమావేశ ఎజెండాను రూపొందించింది. ఎజెండాలో 'ఉక్రెయిన్, గాజాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు', 'ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత పరిస్థితులు', 'వలసలు', 'ఆర్థిక భద్రత', 'కృత్రిమమేధ' విషయంలో అంతర్జాతీయ సహకారంవంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

సమ్మిట్ ముఖ్య నిర్ణయాలు

- జీ-7 సభ్య దేశాలు దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ సమావేశం నేపథ్యంలో ఉక్రెయిన్‌తో అమెరికా పదేళ్ల సమయానికి గానూ ఒక భద్రతా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సంపత్తిని అందించనుంది. ఇదేతరహా భద్రతా ఒప్పందం జపాన్ కూడా ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంగానే జరిగింది.
- అమెరికా, యూరప్‌ల్లో స్తంభింపజేసిన రష్యా ఆస్తులను హామీగా పెట్టుకుని ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల రుణాన్ని జీ-7 దేశాలు అందించాయి. ఇకముందు కూడా దఫాలవారీగా ఇలాంటి రుణాలను ఉక్రెయిన్‌కు అందించేందుకు జీ-7 సభ్యదేశాలు నిర్ణయించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నందుకు గానూ రష్యా నష్టపరిహారం చెల్లించేంత వరకు ఇది కొనసాగించాలని నిర్ణయించాయి.
- ఆహార భద్రతకు, పోషకాహారానికి గల వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించేందుకు కృషిచేయడానికి 'అపూలియా ఫుడ్ సిస్టమ్స్ ఇనీషియేటివ్'ను ప్రకటించారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థికంగా సహకరించేందుకు జీ-7 దేశాలు ఆరంభించిన 'పార్టనర్‌షిప్ ఫర్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్' ద్వారా 2027 నాటికి 600 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించడానికి నిర్ణయించారు.
- కృత్రిమమేధ రంగంలో పరిశోధనలు చేస్తూ అడ్వాన్స్‌డ్ ఏఐ సిస్టమ్స్‌ను రూపొందిస్తున్న సంస్థలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ కోడ్ ఆఫ్ కండక్ట్(ప్రవర్తనా నియమావళిని) రూపొందించడానికి అంగీకరించారు. కృత్రిమమేధ సృష్టించే సమస్యలను ఎదుర్కొంటూ, అది అందించే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
- అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా అవలంబిస్తున్న దమన నీతిని అడ్డుకుని మార్కెట్ ఒడుదొడుకులు, వక్రీకరణల నుంచి పరిశ్రమలను, కార్మికులను, పెట్టుబడులను, ఆర్థికభద్రతను పరిరక్షించుకునేందుకు జీ-7 దేశాలు చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు.
- వలసలు సంధించే సమస్యలు, అందించే అవకాశాలపరంగా వలస విధానాలపై ఒక సంయుక్త విధాన రూపకల్పనకు 'లాస్‌ఏంజెల్స్ డిక్లరేషన్ ఆన్ మైగ్రేషన్ అండ్ ప్రొటెక్షన్' మార్గనిర్దేశంలో కృషిచేయాలని పిలుపునిచ్చారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోభివృద్ధి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల భాగస్వామ్యం, సహకారం పెంపునకు పిలుపునిచ్చాయి. అదేవిధంగా పరిశుద్ధ ఇంధన వనరుల వినియోగం దిశగా తరలడం ద్వారా వాతావరణ మార్పులను, కాలుష్యాన్ని, జీవవైవిధ్య నష్టాన్ని ఎదుర్కొనేందుకు పిలుపునిచ్చాయి.
- లైంగిక ఆరోగ్యం, పునరుత్పాదక అంశాలు, లింగ అసమానతలకు సంబంధించి సమాన హక్కులు ఉండేలా చర్యల కోసమై పిలుపునిచ్చాయి.
- అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించేందుకు గాజాలో కాల్పుల విరమణను ఆశించడంతోపాటు 'తగిన సమయంలో' పాలస్తీనాను దేశంగా గుర్తించడంతో సహా రెండు దేశాల పరిష్కారానికి జీ-7 కట్టుబడిందని మరోసారి నొక్కిచెప్పారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'పుష్పక్' హ్యాట్రిక్

(మొదటి పేజీ తరువాయి)

మూడో పరీక్ష ఎల్‌ఈఎక్స్-03ను కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఆదివారం ఉదయం 7.10 గంటలకు నిర్వహించినట్టు ఇస్రో ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. గతంలో నిర్వహించిన ఎల్‌ఈఎక్స్-01, ఎల్‌ఈఎక్స్-02 విజయవంతమైన నేపథ్యంలో ఈసారి మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించినట్టు పేర్కొంది. ప్రయోగంలో భాగంగా పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. అక్కడి నుంచి పుష్పక్ స్వయంగా క్రాస్ రేంజ్ కరెక్షన్ విన్యాసాలను చేపడుతూ.. రన్‌వేపైకి చేరుకుని నిర్దేశిత సెంటర్‌లైన్ వద్ద ల్యాండ్ అయింది. ఈ వాహనానికి సంబంధించిన తక్కువ లిఫ్ట్-టు-డ్రాగ్ నిష్పత్తి, ఏరోడైనమిక్ కాన్ఫిగరేషన్ కారణంగా ల్యాండింగ్ వేగం గంటకు 320 కి.మీ. కంటే ఎక్కువగా ఉందని, కమర్షియల్ విమానాల్లో ఇది గంటకు 260 కి.మీ., సాధారణ యుద్ధ విమానానికి గంటకు 280 కి.మీ. ఉంటుందని ఇస్రో తెలిపింది. పుష్పక్ రన్‌వేపై ల్యాండయిన తర్వాత బ్రేక్ పారాచూట్ సాయంతో దాని వేగాన్ని గంటకు 100 కి.మీ.కు తగ్గించామని, ఆ తర్వాత ల్యాండింగ్ గేర్ బ్రేక్‌లను ఉపయోగించి దాన్ని రన్‌వేపై నిలిపివేశామని పేర్కొంది. అంతరిక్షం నుంచి తిరిగొచ్చే సమయంలో ఆర్ఎల్‌వీ విధానం ఎలా ఉంటుంది, హైస్పీడ్ ల్యాండింగ్‌ను అది ఎలా నియంత్రించగలుగుతుంది వంటి పరిస్థితులను ఈ మిషన్ విజయవంతంగా ప్రదర్శించిందని ఇస్రో వివరించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) నేతృత్వంలో సాగిన ఈ మిషన్‌ను ఇస్రో కేంద్రాలైన స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ), ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్), శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌ల నుంచి శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు. ఎంతో సంక్లిష్టమైన ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాన్ని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అభినందించారు.

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ హోమోసెక్స్ కేసులో అరెస్టయ్యారు. అసహజ లైంగిక దౌర్జన్యం వివాదంలో సాక్ష్యాలను పోలీసులకు వివరించేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ సూరజ్‌ను హొళెనరసీపుర పోలీసులు శనివారం రాత్రంతా విచారించారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు సూరజ్ రేవణ్ణను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. సూరజ్‌పై ఐపీసీ 377 (అసహజ లైంగిక దౌర్జన్యం), 342, 506, సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై సూరజ్‌రేవణ్ణ లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని జేడీఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు ఆరోపించారు. ఈ ఆరోపణలను సూరజ్‌రేవణ్ణ ఖండించారు. తననుంచి రూ.5కోట్లు పొందాలని చేతన్ అనే వ్యక్తి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలావివాదం సాగుతుండగానే.. తనను చేతన్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు సాక్ష్యాలున్నాయంటూ శనివారం రాత్రి సూరజ్‌రేవణ్ణ హొళెనరసీపుర గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే, చేతన్ అంతకుముందే డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు సూరజ్‌ను తెల్లవారుజామున 4 గంటలదాకా విచారణ జరిపారు. తర్వాత అరెస్టు చేశారు. మరోవైపు బాధితుడిని బెంగళూరులోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

లోకం తీరు



నేటి నుంచి లోక్‌సభ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకారం చేస్తారు. ఒక్కో ఎంపీ ప్రమాణానికి ఒక నిమిషం సమయం ఉంటుంది. ప్రధాని మోదీ క్యాబినెట్‌లోని మంత్రుల్లో 58 మంది లోక్‌సభ సభ్యులు, 13 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లూధియానా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడం గమనార్హం. లోక్‌సభ సమావేశాలు జూలై 3 వరకు కొనసాగనున్నాయి. కాగా, లోక్‌సభలో తొలి రోజే ఏపీకి చెందిన 25 మంది సభ్యులు ప్రమాణం చేయనుండగా, రెండో రోజు తెలంగాణకు చెందిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తారు. మూడో రోజైన 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. రాజ్యాంగంలోని 93వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతూ వస్తోంది. సహజంగా అధికార పక్షానికి చెందిన ఎంపీకి స్పీకర్ పదవి, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ప్రతిపక్షాలకు ఇచ్చే ఉపసభాపతి పదవిని తమకు ఇవ్వాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. 17వ లోక్‌సభలో బీజేపీకి చెందిన ఓంబిర్లా స్పీకర్‌గా ఉన్నారు. ఉపసభాపతి స్థానానికి ఎవరినీ ఎంపిక చేయకపోవడం వల్ల ఆ పదవి ఐదేళ్లు ఖాళీగా ఉంది. ఈ సారి ఉపసభాపతిని ఇండియా కూటమికి ఇస్తుందా? లేదా ఎన్డీయే మిత్రపక్షాల్లో ఎవరికైనా అప్పగిస్తుందా? అన్నది వేచిచూడాల్సిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 27న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆమె ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో ప్రసంగిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌తోపాటు సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, సంజయ్, శ్రీనివాస వర్మలు తొలిరోజే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అవహేళనలకు గురైనవేళమీ ఆదరణే రక్షించింది

» వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ

వయనాడ్, జూన్ 23: కేరళలోని వయనాడ్ నియోజకవర్గానికి రాజీనామా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం అక్కడి ప్రజలకు భావోద్వేగపూరిత లేఖ రాశారు. వయనాడ్, రాయ్‌బరేలీ రెండు చోట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆయన ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. వంశపారంపర్య స్థానంగా గుర్తింపు పొందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకొని వయనాడ్‌ను విడిచిపెట్టారు. ఇక్కడ ఆయన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వయనాడ్ ప్రజలకు లేఖ రాశారు. 'ప్రతి రోజూ అవహేళనలకు గురైన సమయంలో మీరు చూపించిన అపరిమిత ప్రేమే నన్ను కాపాడింది' అని ఆ లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు. "వయనాడ్‌ను వదులుకోవాలన్న నిర్ణయాన్ని ప్రకటించేందుకు మీడియా ముందుకు వచ్చినప్పుడు నా కళ్లలోని విచారాన్ని మీరు చూసే ఉంటారు. అయిదేళ్ల క్రితం ఓ పరాయివ్యక్తిగా మీ ముందుకు వచ్చాను. అయినా మీరు నన్ను నమ్మారు. హద్దులు లేని ప్రేమ, అభిమానంతో అక్కున చేర్చుకున్నారు. ప్రతి రోజూ దుర్భాషలకు గురయిన సమయంలో మీరు చూపిన షరతుల్లేని ప్రేమే నన్ను సంరక్షించింది. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు. మీరు నా కుటుంబంలో సభ్యులు" అని పేర్కొన్నారు.

సగం మందే హాజరు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించగా.. చండీగఢ్ కేంద్రంలో పరీక్ష రాయాల్సిన ఇద్దరూ హాజరు కాలేదు. ఛత్తీసగఢ్‌లో రెండు కేంద్రాల్లో 602 మంది పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేయగా.. కేవలం 291 మందే వచ్చారు. హరియాణాలో రెండు కేంద్రాల్లో 494 మందికి ఏర్పాట్లు చేయగా.. 287 మంది, మేఘాలయలో 464 మందికిగాను 234 మంది మాత్రమే పరీక్ష రాశారు. గుజరాత్‌లో ఒకే ఒక్క అభ్యర్థి కోసం పరీక్ష పెట్టారు. మరోవైపు.. నీట్ కేసు దర్యాప్తున చేపట్టిన సీబీఐ.. ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు.. నీట్-యూజీ 2024 పరీక్ష నిర్వహణలో కొన్ని రాష్ట్రాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్టు పేర్కొంటూ గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ సెక్షన్ 120-బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 420 (చీటింగ్) కింద కేసులు నమోదు చేసింది. ఇక.. నీట్, యూజీసీ నెట్ ప్రశ్న పత్రాలు లీక్ అయిన నేపథ్యంలో.. ఆ రెండింటితోపాటు జేఈఈ మెయిన్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ సహా పలు ప్రవేశ, పోటీ పరీక్షలు నిర్వహించే ఎన్టీఏ వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందన్న వదంతులు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఎన్టీఏ అప్రమత్తమై.. అలాంటిదేమీ లేదని, ఎన్టీఏ, దాని అనుబంధ వెబ్‌సైట్లన్నీ అత్యంత భద్రంగా ఉన్నాయని ప్రకటించింది. మరోవైపు.. పరీక్షల సంస్కరణలపై ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ సోమవారం సమావేశం కానుంది.



సీబీఐ అధికారుల కారుకు అడ్డుపడిన కసియాడిహ్ గ్రామస్థులు

ఆ నలుగురికే కాదు..

నీట్ పేపర్ లీక్ కేసులో బిహార్ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు కీలక నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురికి కాదు.. మొత్తం 25 నుంచి 30 మంది విద్యార్థులకు ప్రశ్నపత్రాన్ని అమ్మారు. ఒక్కొక్కరికీ రూ.30 నుంచి రూ.40 లక్షలకు విక్రయించినట్టు.. సికందర్ యాదవేందు, అఖిలేశ్ కుమార్, బిట్టు కుమార్, సంజీవ్ సింగ్, రాకీ, నితీశ్, అమిత్ ఆనంద్ తదితర నిందితులు తమ నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మే 4వ తేదీ రాత్రి బిహార్‌లోని సాల్వర్ గ్యాంగు మునిసిపల్ జూనియర్ ఇంజనీర్ సికందర్ యాదవేందు ద్వారా నలుగురు విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాన్ని జవాబులతో సహా అందజేసే సమయంలోనే పట్నా పోలీసులకు ఝార్ఖండ్ పోలీసుల నుంచి ఈ వ్యవహారంపై ఉప్పందింది. ఈ వ్యవహారంలో మొత్తం 13 మంది నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలను మే 5వ తేదీనే నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. కాగా.. కేంద్రానికి బిహార్ ఈవోయు పంపిన ఆరు పేజీల నివేదిక ఆధారంగా ఎన్టీఏ మరో 17 మంది విద్యార్థులను డిబార్ చేసింది. దీంతో ఈ ఏడాది నీట్ రాసినవారిలో 110 మందిని డిబార్ చేసినట్టయింది. అలాగే.. ఈ కేసులో బిహార్ ఈవోయు యూనిట్ మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి దాకా బిహార్‌లో అరెస్టయినవారి సంఖ్య 18కి చేరింది. మహారాష్ట్రలోనూ నాందేడ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకుని విచారించారు.

సీబీఐ బృందంపై దాడి

యూజీసీ-నెట్ కేసు దర్యాప్తులో భాగంగా.. ఫూల్ చంద్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేస్తూ బిహార్‌లోని నవాదా ప్రాంతానికి వెళ్లిన సీబీఐ బృందంపై కసియాడిహ్ గ్రామస్థులు దాడి చేశారు. సీబీఐ బృందంలో నలుగురు అధికారులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. గ్రామస్థులు వారిపై దాడి చేయగా.. సీబీఐ బృందం స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా వచ్చి కాపాడారు. అనంతరం స్థానిక పోలీసుల సమక్షంలో దర్యాప్తు కొనసాగించిన సీబీఐ బృందం రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. కాగా.. తమ గ్రామానికి వచ్చింది నకిలీ అధికారుల బృందం అనే సందేహంతోనే గ్రామస్థులు సీబీఐ అధికారులపై దాడి చేసినట్టు స్థానిక పోలీసులు చెప్పారు.


నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): 'నీట్ కుంభకోణా'నికి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ వల్ల కుళ్లిపోయిన విద్యా వ్యవస్థ.. అధికారులను మార్చినంత మాత్రాన బాగుపడదని శనివారం 'ఎక్స్' పోస్టులో వ్యాఖ్యానించారు. ఇప్పుడు నీట్-పీజీని వాయిదా వేశారని, గత పది రోజుల్లో నాలుగు పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలోకి ప్రశ్నపత్రాల లీక్‌లు, అవినీతి, అక్రమాలు, మాఫియా చొరబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, మాఫియా ముందు ప్రధాని మోదీ నిస్సహాయంగా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీట్-పీజీ వాయిదా పడడం మోదీ హయాంలో ధ్వంసమైన విద్యా వ్యవస్థకు మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను, పిల్లల భవిష్యత్తును మాఫియా, అవినీతిపరులు, భజనపరులైన అసమర్థుల చేతుల్లో పెట్టిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. యువత భవిష్యత్తుకు బీజేపీయే అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు.

2038 జూలై 6న గ్రహశకలం
భూమిని ఢీకొట్టే ముప్పు

న్యూఢిల్లీ, జూన్ 23: పద్నాలుగేళ్ల తర్వాత 2038వ సంవత్సరం జూలై 12వ తేదీన ఓ గ్రహశకలం భూమిని ఢీకొట్టే ముప్పు ఎక్కువగా(72%) ఉందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. ఈ గ్రహశకలం పరిమాణం, వేగం, దాని వల్ల కలిగే అనర్థాలపై ఇప్పుడే అంచనాకు రాలేమని తెలిపింది. అయితే, దాన్ని దారి మళ్లించే సాంకేతిక అందుబాటులో ఉన్నప్పటికీ, ఈ గ్రహశకలానికి సంబంధించి ఇంకా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదని వివరించింది. గ్రహశకలం కదలికలను గమనిస్తున్నామని తెలిపింది. జూన్ 20న మేరీలాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ ల్యాబ్(ఏపీఎల్)లో నిర్వహించిన పరిశోధనల్లో ఈ గ్రహశకలం కదలికలను గుర్తించారు. తాజాగా ఓ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రహశకలాలు భూమి వైపునకు దూసుకువస్తున్నాయన్న అంతరిక్ష పరిశోధన సంస్థల ప్రకటన లు సాధారణమే అయినప్పటికీ ఈసారి నాసా తేదీతో సహా హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకొంది.

మేనల్లుడే వారసుడు: మాయావతి



లఖ్‌నవూ, జూన్ 23: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను మరోసారి తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆయనకు పార్టీ జాతీయ సమన్వయకర్తగా తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో ఎన్నికల సమయంలో ఆకాశ్‌కు పరిపక్వత లేదని పేర్కొంటూ ఆయనను వారసుడిగా తొలగించడంతో పాటు పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. "ఆకాశ్ పూర్తి పరిణతి కలిగిన నేత ఎదుగుతారని ఆశిస్తున్నా. భవిష్యత్తులో అతను నా అంచనాలను అందుకోగలరు" అని తాజాగా మాయావతి పేర్కొన్నారు.

ఈ ఐదేళ్లూ..

ఒక్క పని జరిగితే ఒట్టు..

- అభివృద్ధికి దూరంగా శృంగవరపుకోట మేజర్ పంచాయతీ
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటూ కదలని పనులు
- టీడీపీ అధికారంలోకి రావడంతో చిగురిస్తున్న ఆశలు

(శృంగవరపుకోట)

జిల్లాలో అతిపెద్ద మేజర్ పంచాయతీ శృంగవరపుకోట. పేరుకే గ్రామం తప్ప పూర్తిగా పట్టణ వాతావరణం కనిపిస్తుంది. ఇలాంటి ప్రాంతంలో సరైన ఆదాయ వనరులు లేకపోవడంతో పారిశుధ్య కార్మికులకు నెలనెలా జీతాలు అందని దుస్థితి. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ పార్టీకి చెందిన వారినే సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. అయినప్పటికీ ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పనీ జరగలేదు. కనీసం రోడ్లు, మురుగుకాలువలవంటి వాటిపైన దృష్టిసారించ లేదు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రక్షాళన, కళింగగెడ్డ, విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకుని ఉన్న కుళ్లికోనేరు శుద్ధి, శిథిలావస్థకు చేరిన పంచాయతీ, అద్దె భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణం, పుణ్యగిరి దేవాలయ అభివృద్ధి, నిరంతర తాగునీటి సరఫరా.. ఇలా అనేక వాటి గురించి వాగ్దానాలు మాత్రం చేశారు. ఆచ రణలో చూపించలేదు. దీంతో వైసీపీ హయాం లోని ఐదేళ్ల పాలనంతా శూన్యమే అయ్యింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ రాష్ట్రంలో అధికా రాన్ని చేజిక్కించుకుంది. శాసన సభ్యురాలుగా కోళ్ల లలిత కుమారి శుక్రవారం శాసనసభలో ప్రమాణం చేశారు. ఈ పంచాయతీ అభివృద్ధికి మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

స్థాయి మారినా అవే సేవలు

ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుంచి ప్రాంతీయ ఆసుపత్రిగా స్థాయి పెరిగింది. కానీ ఇందుకనుగుణంగా సేవల్లో మార్పు కనిపించలేదు. రోగులకు వ్యాధులను నయం చేసే వైద్యులకంటే ఇక్కడ వైద్యేతర సిబ్బందికి సదుపా యాలెక్కువ. వారిదే ఇక్కడ పెత్తనం. భవన నిర్మాణాలకు నిధులు కేటా యించారు. 2022 జనవరి నాటికే పూర్తికావాల్సిన భవనాలు ఇప్పటికీ పూర్తికా లేదు. ఈ ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీసం సేవలు అందడం లేదన్న విషయం బహిరంగ రహస్య మే.



జనావాసాల మధ్య నుంచే మురుగు కాలువ

ఈ మేజర్ పంచాయతీలో జనావాసాల మధ్య నుంచే మురుగు కాలువ ఉంది. ఒకప్పటి పంట కాలువ నిర్వహణ లోపం కారణంగా మురుగుకాలువగా మారింది. దీన్ని ప్రక్షాళన చేసేందుకు టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి రూ.1.50 కోట్ల వరకూ నిధులు రాబట్టారు. అయితే ఈ సొమ్ము మురుగు కాలువ శుద్ధికి చాలకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. సాగునీటి శాఖ అధికారులు తమ తప్పిదాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేసే క్రమంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారం చేపట్టింది. జనావాసాల మధ్య మురుగుకాలువ ఉందన్న విషయాన్ని కూడా గుర్తించుకోలేదు. దీనిగురించి ఎవరైనా ప్రస్తావించినప్పుడు నాలుగు మాటలు చెప్పి సరిపెట్టేందుకే ప్రాధాన్యమిచ్చేవారు.

ముక్కుమూసుకోవాల్సిందే..

ఈ పంచాయతీకి నడిబొడ్డున కుళ్లికోనేరు ఉంది. దీనికి ఆనుకుని షిర్డీ సాయిబాబా దేవాలయం, విశాఖ-అరకు రోడ్డు ఉంది. ఈరోడ్డులో ప్రయాణికులతో పాటు బాబాను పూజించే భక్తులు ఇక్కడకు వచ్చేసరికి ముక్కుమూసుకోవాల్సి వస్తుంది. ఈ కోనేరు వల్ల తీవ్ర దుర్గంధం వస్తుండడంతో శుద్ధి చేస్తామని వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పలుమార్లు హామీ ఇచ్చారు. దీని శుద్ధికోసం పంచాయతీ పరిధిలో స్వచ్ఛంద విరాళాలు సేకరించేందుకు కొంత మందితో కమిటీ వేశారు. కానీ ఒక్క పైసా కూడా వసూలు కాకపోవడంతో ఫలితం దక్కలేదు.

ఖాళీ స్థలాలను వినియోగించుకుంటే ఎంతో ఆదాయం

మూడు దశాబ్దాల క్రితం ఈ పంచాయతీ పరిధిలో 34 అద్దె భవనాలు నిర్మించారు. అవన్నీ శిథిలావస్థకు చేరాయి. దీనికి తోడు అద్దెలు తక్కువగా ఉన్నాయి. వీటి స్థానంలో కొత్తగా మూడు అంతస్థులతో భవనాలు నిర్మిస్తే ఆదాయం వస్తుంది. పాత బస్‌స్టాండ్ మార్కెట్‌లోనూ ఖాళీగా స్థలం ఉంది. దీన్ని వినియోగించుకుంటే మరింత అద్దెలు వస్తాయి. విభజిత ఏపీలో అధికారం చేపట్టిన టీడీపీ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి నిధులు రాబట్టారు. అప్పటి, ప్రస్తుత శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి ఈ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకొచ్చేలోపే ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు నూతనంగా నిర్మాణాలు చేపడతామని ఐదేళ్లగా చెబుతూ వచ్చారే తప్ప కనీస ప్రయత్నం చేయలేదు. దీంతో ఎటువంటి ఆదాయ వనరులు లేకపోవడంతో పారిశుధ్య కార్మికులకు నెలనెలా జీతాలు అందించలేకపోతున్నారు. ఇంటి పన్నుల నుంచి వసూలు చేసిన నిధులను సర్దుబాటు చేయాల్సి వస్తుంది. దీంతో ఇతర అభివృద్ధి కుంటుపడుతుంది.

నిరంతర తాగునీటి సరఫరా కష్టమే..

ఇంటింటికీ కుళాయిలంటూ ఐదేళ్లుగా ఈ పంచాయతీ ప్రజలను వైసీపీ ప్రభుత్వం మభ్యపెడుతూ వచ్చింది. ఆఖరి సంవత్సరంలో పనులు మొదలు పెట్టారు. పైపులైను ఏర్పాటు పేరుతో ఎక్కడికక్కడ తవ్వి వదిలేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న రోడ్లన్నీ ఛిద్రం చేసేశారు. దీంతో రాకపోకలకు స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక్క ఇంటికి కూడా తాగునీరు ఇవ్వలేదు. ఈ పంచాయతీకి మొదటి దశలోనే టీడీపీ తాటిపూడి పైలెట్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన ప్రాజెక్టును విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా నిధులు వెనక్కిపోకుండా అప్పటి టీడీపీ శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి చూశారు. దీంతో ఈ గ్రామంతో పాటు మరో 98 గ్రామాలకు తాగునీటి సరఫరాకు భాగ్యం కలిగింది. ప్రభుత్వం మారి వైసీపీ అధికారం చేపట్టిన తరువాత ఈ ప్రాజెక్టును పట్టించుకోవడం మానేశారు. మిగిలిన గ్రామాలకు తాగునీటి సరఫరా అటుంచితే నిరంతర తాగునీటి సరఫరాకు గతి లేకుండా పోయింది. ఈ ప్రాజెక్టు నిర్వహణలో జరుగుతున్న అవకతవకలతో వారంలో ఒక ట్రెండు రోజులు తాగునీటి సరఫరా ఉండడం లేదు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఈ మేజర్ పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయి. ఈ ఐదేళ్లలో ఒక్క సమస్యనైనా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ పనులన్నీ రూ.కోట్లలో ఖర్చు చేయాల్సినవే. గతంలో టీడీపీ హయాంలోనే ఈ పంచాయతీ అభివృద్ధి జరిగింది. ఇప్పుడు తిరిగి టీడీపీ అధికారంలోకి రావడం, మళ్లీ కోళ్ల లలిత కుమారి శాసన సభ్యురాలిగా ప్రమాణం చేయడంతో వీటిల్లో కొన్నింటికైనా మోక్షం లభిస్తుందన్న ఆశ స్థానికుల్లో ఉంది.



ఎస్‌కోట వ్యూ

పుణ్యగిరిపైన వివక్ష

శృంగవరపుకోటకు మూడు కిలోమీటర్ల దూరంలో అనంతగిరి కొండల్లో పుణ్యగిరి దేవాలయం ఉంది. దీన్ని దక్షిణ కాశీగా పిలుస్తారు. ఇక్కడ కొలువై ఉన్న శ్రీఉమాకోటి లింగేశ్వర స్వామి నిత్యపూజలందుకుంటున్నారు. అరకు పర్యాటకానికి వెళ్లేదారిలో ఉన్న ఆలయం కావడంతో భక్తుల తాకిడి ఉంటుంది. చుట్టూ పచ్చని కొండలు ఉండడంతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. మహాశివరాత్రి, కార్తికమాస పర్వదినాల్లో లక్షల్లో భక్తులు వస్తారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని వైసీపీ ప్రజా ప్రతినిధులు వాగ్దానాలు చేశారు. కొండపైకి రోడ్డేస్తామని చెప్పారు. ఐదేళ్లపాటు మహాశివరాత్రి, కార్తికమాస సమయంలో రోడ్డేసినట్లు తవ్వించే తవ్వి కాలయాపన చేశారు. ఆలయం, స్నాన ఘట్టాలు పుట్టదార, శ్రీదారగంగమ్మ జలపాతం వద్ద ఎటువంటి అభివృద్ధీ చేయలేదు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించేవారమని, ప్రభుత్వం మారిన తరువాత పేరు మార్చామన్నారు. ఫిర్యాదుదారులు ఎవరైనా వచ్చి వారి సమస్యలపై ఫిర్యాదులు చేసుకోవచ్చునని తెలిపారు. పుర పాలక సంఘం కార్యాలయంలో కూడా ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ జె రామప్పల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని అందరూ దానిని సంరక్షించాలని గ్రీన్‌ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దవీధి శివాలయం, బెహర చెరువు గట్టుపై మొక్కలు నాటించారు.

కరకవలసలో పశువులమ్మతల్లి పండగ

వేపాడ: మండలంలోని కరకవలస గ్రామ ప్రజలు ఆదివారం గ్రామ దేవత పశువులమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారి గుడి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడంతో పాటు భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాదికి ఒక్కసారి రోహిణీ కార్తెలో జరుపుకోనున్న ఈ పండగకు చుట్టాలు, బంధువులతో పాటు ఆడపిల్లలు, అల్లుళ్లతో ఆనందంగా గడిపారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాలు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట గ్రామంలో ఆదివారం దేశమ్మతల్లి వారాలు ఘనంగా నిర్వహించారు. ఏటా వర్షాకాలం ముందు ఈ దేశమ్మ తల్లికి మొక్కులు చెల్లించడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆదివారం సాయంత్రం పసుపు కుంకుమలతో అమ్మవారికి పూజలు, మొక్కులు చేశారు. దీంతో ఈ ప్రాంతమంతా ఎంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ వారాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చారు.

జగన్ బటన్ నొక్కిన చేయూత డబ్బులు ఏవీ?

బొబ్బిలి: ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు వైఎస్సార్ చేయూత పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లోనికి డబ్బులు జమ చేసేందుకు అప్పటి సీఎం జగన్ రెడ్డి బటన్ నొక్కి ఎంతో హడావిడి చేశారని, ఆ డబ్బులు ఇంతవరకు జమ కాలేదని సీపీఎం నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం ఆరోపించారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల తరువాత లబ్ధిదారులకు అందజేయాలని టీడీపీ డిమాండ్ చేసిందని, ఇప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం తక్షణం లబ్దిదారులకు చెల్లింపులు చేపట్టాలన్నారు. పాత పథకాలన్నిటినీ కొనసాగిస్తామని, రద్దు చేయబోమని చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వాటిని అమలుచేయాలని ఆయన కోరారు. తక్షణం చేయూత పథకం చెల్లింపులు జరపాలని లేకుంటే ఆందోళన చేస్తామని తెలిపారు.

జేఎస్ఎల్ కార్మికుల మూడో రోజు వంటావార్పు

కొత్తవలస, జూన్ 23: మండలంలోని జేఎస్ఎల్ కర్మాగారానికి చెందిన కార్మికులు ఆదివారం మూడో రోజు కూడా వంటా వార్పు కార్యక్రమంతో పాటు రిలే దీక్షలను కొనసాగించారు. కర్మాగారానికి చెందిన కార్మికులు కొంతమంది రిలే దీక్షలు చేయగా వారికి కార్మిక సంఘం నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు, బాలిబోయిన ఈశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం ఎంత మొండి వైఖరి అవలంభిస్తే అంతకంటే ఎక్కువ పట్టుదలతో తమ పోరాటాన్ని కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్మికులు ఇప్పటికి 39 రోజులుగా ఎక్కడా వెనక్కు తగ్గకుండా రెట్టించిన మనోధైర్యంతో పోరాటం కొనసాగిస్తున్నామన్నారు. కార్మికులు కొద్ది రోజుల తర్వాత ఆందోళన విరమిస్తారులే అనుకున్న యాజమాన్యానికి దీటుగా కార్మికులు సమాధానం ఇస్తూ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు తప్ప ఎక్కడా నిరాశ పడలేదన్నారు. యాజమాన్యం ఇదే వైఖరిని అవలంబిస్తే భవిష్యత్తులో పోరాటం మరింత తీవ్రంగా మారుతుందన్నారు. కార్మాగారంలో ఉన్న మూడు కార్మిక సంఘాలు ఒకే మాటపై ఉంటున్నాయని, ఇలా మూడు కార్మిక సంఘాలు కలసి పోరాటం చేస్తామని తెలిపారు.



రిలే దీక్షలు చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి

- రెవెన్యూ మంత్రిని కలిసిన ఆ సంఘ నాయకులు



మంత్రికి వినతపత్రం అందజేసిన వీఆర్యేల సంఘ నాయకులు

వేపాడ, జూన్ 23: రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ మంత్రి అవ గాని సత్యప్రసాద్‌ను ఆదివారం సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు జిల్లా వీఆర్యేల సంఘం నాయకుడు గ ట్టు వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా వీఆర్యేలుగా పని చేస్తూ చాలీచాలని వేతనాలతో సతమతమౌతున్న వీరి కష్టా లను మంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు. మంత్రితో కనీసం రాష్ట్ర సంఘ నాయకుల సమావేశం సుమారు 15 నిమషాల పాటు జరిగిందన్నారు. ము ఖ్యంగా వీఆర్యేలకు పేస్కేలు అమలుపై వివరించామన్నారు. అలాగే తెలంగాణలో ఏవిధంగా అమలు చేశారో సంబంధిత జీవోలను మంత్రికి అందజేశామన్నారు. ఎ టువంటి విద్యార్హతలు బట్టి వివిధ శాఖల్లో ఏ విధంగా కేటాయింపులు జరిగాయో తెలియజేశామన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారికి తెలంగాణ ప్రభుత్వం ఏవిధంగా ప్రయోజనం చేకూర్చిందో వివరించామని పేర్కొన్నారు. దీనిపై మంత్రి సత్యప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ పేస్కేలు గనుక అమలు చేస్తే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చినట్లు వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ నాయకులు షేక్ బందగీ సాహెబ్(పల్నాడు), టి.త్రినాధరావు(శ్రీకాకుళం జిల్లా), కే.రవికుమార్(అనకాపల్లి) విజయనగరం జిల్లా నుంచి తను పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. అలాగే పౌరసరఫరాల మంత్రి, రాష్ట్ర జనసేన పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్‌ను కలిసి వీఆర్యేల సమస్యలను వివరించి పరిష్కారానికి సహకరించాలని కోరినట్లు గట్టు పేర్కొన్నారు.

తూర్పుకాపు సామాజిక వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక

దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని తూర్పుకాపు సామాజిక వేదిక కార్యాలయంలో ఆదివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అంబల్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఆర్లె కృష్ణరావు, కోశాధికారిగా పత్తిగుళ్ల రామారావు, ఉపాధ్యక్షులుగా గిరిడ అప్పల నాయుడు, పిన్నింటి చంద్రమౌళి , లీగల్ ఎడ్వైజర్లుగా వై.పరుశురాం , చందక చిన్ని ప్రభాకర్ , సహాయ కార్యదర్శులుగా కోట్ల మూర్తి , కోరాడ సత్యం , గౌరవ అధ్యక్షులుగా కడగల ఆనంద్ , పతివాడ అప్పలనారాయణ, గొర్లె వెంకటరమణ, సభ్యులుగా మహంతి వెంకటరమణ, మీసాల నాగేశ్వరావు , మంతిని రమేష్ తాడ్డి ప్రసాద్ , కోట్యాడ శ్రీను, చెల్లూరి రమణ, పెదమజ్జి సత్యాన్నారయణ ఎన్నికయ్యారు.

భవానీమాత పీఠంలో లలితకుమారి పూజలు

శృంగవరపుకోట: మండల కేంద్రంలోని గౌరీనగర్‌లో ఉన్న శ్రీభవానీపీఠం వార్షికోత్సవం వేడుకల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని పూజలుచేశారు. ఆదివారం పీఠం గురుభవానీ గురునాయుడు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారంచేసిన లలితకుమారీకి స్థానిక మహిళలు సత్కరించారు. జీఎస్ నాయుడు, చెక్క కిరణ్, వాకాడ బాలు, వాసు, బర్మాకాలనీ సాయిరాం, భీశెట్టి ఆరుణ, అనకాపల్లి చెల్లయ్య తదితరులున్నారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదానంలో పాల్గొన్నారు.



లలితకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

దాసన్నపేట: నగరంలో ఆదివారం ఒలింపిక్ డే సందర్భంగా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో క్రీడాకారులు, అభిమానులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ జరిగింది. ఒలింపిక్ సంఘం అధ్యక్షులు గురాణ అయ్యలు జెండా ఊపి ప్రారంభించారు. కార్యదర్శి వేణుగోపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఒలింపిక్ డేని పురస్కరించుకుని స్థానిక వీరబొబ్బిలి క్రీడా మైదానంలో స్పోర్ట్స్ రీక్రియేషన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యువకులకు ఆదివారం పలుపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు యువకులు కార్యదీక్షతో శ్రమించాలని హితవు పలికారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు ఐవీ రాజేశ్వరరావు మాట్లాడుతూ పోలీసు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రక్షణ దళాల్లో చేరేందుకు యువతీయువకులను తీర్చిదిద్దడంతో స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్‌చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యదర్శి సిరిపురపు ప్రసాద్, ఆర్‌కే చౌదరి, మీసాల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో ఒలింపిక్ డే ర్యాలీలో క్రీడాకారులు



బొబ్బిలి: క్రీడల్లో పాల్గొన్న యువత

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కొమరాడ, జూన్ 23: మండలంలో అర్తాం గ్రామానికి చెందిన జి.శంకరరావు (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ నాయుడు తెలిపారు. దీనికి సంబంధించికుటుంబ సభ్యులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి శంకరరావు మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శంకరరావు మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాయుడు చెప్పారు.

గాయపడిన యువకునికి ఆర్థిక సాయం

కొత్తవలస, జూన్ 23: తాటి చెట్టుపై నుంచి ప్రమాదవసాత్తు పడి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని రెల్లి పంచాయతీ, ముమ్మనవానిపాలెం గ్రామానికి చెందిన రాజాన దుర్గా ప్రసాద్‌కు కొత్తవలసకు చెందిన 2002 వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌చెందిన సభ్యులు ఆదివారం 10 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. 2002 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సేవాదళం పేరుతో గ్రూపుగా ఏర్పడి సాయం అందిస్తున్నట్టు తెలిపారు. గాయపడిన దుర్గాప్రసాద్ కోమాలో ఉన్నారని, చికిత్సకు రూ.15 లక్షల వరకూ ఖర్చవుతుందని కుటుంబసభ్యులు తెలిపారన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా

శృంగవరపుకోట రూరల్, జూన్ 23: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు గోకేడ సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండలపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ నాయుడు, జుత్తాడ రామసత్యం, మాజీ ఎంపీపీ వెంకన్న, టీడీపీ నాయకులు వాసు, బాలు, విశాఖ డెయిరీ డైరెక్టర్ కాటమయ్య తదితరులున్నారు.

ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఐఎంఏ అధ్యక్షుడు



మంత్రిని అభినందిస్తున్న జేసీ నాయుడు

విజయనగరం, జూన్ 23: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఇండియన్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ నాయుడు కలిశారు. మంత్రిని శాలువతో కప్పి సత్కరించారు. ఆదివారం మంగళగిరి వెళ్లి మంత్రిని కలిసి ఐఎంఏ చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాల గురించి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో జేసీ నాయుడుతో పాటు సభ్యులు డాక్టర్ ఫనిధర్, డాక్టర్ నందకిశోర్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ నాగ మల్లికేశ్వరరావు కూడా ఉన్నారు. ఐఎంఏ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారని, ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీఇచ్చినట్లు జేసీ నాయుడు తెలిపారు.

పోలీసులతోనే రక్షణ

శృంగవరపుకోట రూరల్, జూన్ 23: ప్రతి రోజూ ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారంటే దానికి ప్రదాన కారణం పోలీసులే అని సీతంపేట వాసవీ సంఘం అధ్యక్షుడు కుసుమంచి నానాజీ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని సంతగైరమ్మపేట గ్రామంలో డాన్‌టూడెస్క్ కార్యక్రమం నిర్వహించి ఇందులో భాగంగా శృంగవరపుకోట పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళ కానిస్టేబుల్స్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కేసీజీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ నంబూరీ వెంకటపద్మజ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బండారు సీతామహాలక్ష్మి , రేపాక సర్వదేముళ్లు, హరీష్, పచ్చిపులుసు శ్రీనివాసరావు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వందమంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందించారు.



మహిళ కానిస్టేబుల్స్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చిన్నారులకు పుస్తకాల పంపిణీ

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన బర్త్‌డే సందర్భంగా ఆయన అభిమానులు పలు సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులోని భాగంగా మండలంలోని రాజచెరువులస గ్రామంలో ఆదివారం చిన్నారులకు నోట్‌పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలరు యెన్నా బాబు, సమరసతాఫౌండేషన్ ప్రతినిధి ధూపం వాసు, సామాజిక కార్యకర్త కె.కృష్ణదాసు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అలజంగి సీబీపీ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పిల్లలకు బొమ్మలు, క్లిప్‌బోర్డులను పంపిణీ చేశారు.

నేడు బొబ్బిలికోటలో రక్తదాన శిబిరం.

బేబీనాయన జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక కోటలో అవేర్ ఫౌండేషన్, రోటరీక్లబ్, అంజనీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆయా సంస్థల అధినేతలు పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), గెంబలి శ్రీనివాసరావు, పువ్వల శ్రీనివాసరావు పెద్దసంఖ్యలో రక్తదాతలను సమీకరించేందుకు చర్యలు తీసుకున్నారు.

బేబీనాయన పుట్టినరోజుకు ఏర్పాట్లు

బాడంగి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పుట్టినరోజు సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి తన స్వగ్రామమైన ఎరుకులపాకల్లో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. తమ గ్రామంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకుని అభిమానులు, కార్యకర్తలకు స్వీట్లు పంచనున్నట్టు చెప్పారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

- వాడవాడలా బలిదాన్ దివస్

జామి, జూన్ 23: మండల కేంద్రమైన జామిలో బీజేపీ మండలపార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో బలిదాన్‌దివాస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వెంకటేష్, శివ తదితరులున్నారు.

రాజాం: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోటగిరి నారాయణరావు, గుడివాడ నాగరాజు, పట్టణ కన్వీనర్ జొన్నాడ రంజిత్, సామంతు రమణనాయుడు, బండి సత్యనారాయణ, వేమకోటి గిరిబాబు తదితరులు నివాళులర్పించారు.

కొత్తవలస: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మండలానికి చెందిన బీజేపీ నాయకులు, ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం కొత్తవలస జంక్షన్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద భరతమాత, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీలకు సంబంధించిన చిత్రపటాలను ఉంచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాన్యందేముడు, చొక్కాకుల అప్పారావు, పట్నాల శ్రీనివాసరావు, కట్టమూరి గణేష్, ఆర్‌ఎస్ఎన్ మూర్తి, తమటపురాముడు, దున్న రాజు, లెంక గోపీ, ఎస్.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

దాసన్నపేట: దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు, దేశ భక్తుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని జాతీయ కౌన్సిల్ సభ్యులు భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి కొనియాడారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951 ఆక్టోబరు 21న ఢిల్లీలో భారతీయ జనసంఘ్ స్థాపించారన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకుని, బీజేపీకి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచెయ్యాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు అశోక్, గోపాల కృష్ణ, జగ్గారావు, ప్రసాద్, సీతారాం పాల్గొన్నారు.



విజయనగరం: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళర్పిస్తున్న బీజేపీ నాయకులు



జామిలో..



కొత్తవలసలో..



రాజాంలో..

నిధులు రాక.. పనులు సాగక



నిధులు లేక అర్ధంతంగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం

- అర్ధాంతరంగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం
- చాలీ చాలని గదుల్లో విద్యార్థుల అవస్థలు
- నిధులు మంజూరు చేయించాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు
- ఇదీ కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల పరిస్థితి

కురుపాం: కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన అదనపు తరగతి గదులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో కాలం వెల్లదీస్తున్నారు. ఈ పాఠశాలలో 2016లోఆరు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఆర్ఎంఎస్ నిధులు కింద రూ.43 లక్షలు మంజూరయ్యాయి. టెండరుకు ఎవరూ రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత 2019లో అప్పటి పాఠశాల కమిటీ పనులు ప్రారంభించింది. పాఠశాలల అకౌంట్‌లో రూ.25లక్షల మాత్రమే పడటంతో, ఉన్న నిధులు రాకపోవడంతో పనులు అర్ధాంతంగా నిలిపివేశారు. అప్పటి నుంచి వైసీపీ హయాంలో ఇప్పటి వరకూ నిధులు మంజూరు కాకపోవడంతో ఆ తరగతి గదులు దిష్టి బొమ్మలా నిలిచిపోయాయి. అలాగే నాడు-నేడు కింద మరో ఆరు అదనపు గదుల కోసం రూ.72లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణం చేపట్టినప్పటికీ రూ.16లక్షలు మాత్రమే బ్యాంకు అకౌంట్‌లో పడడంతో రెండు గదులకు గచ్చులు, కరెంట్ వేసి మధ్యలోనే పనులు నిలుపుదల చేశారు. ఇప్పటికైనా కొత్తగా గెలిచిన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ చొరవ తీసుకుని పాఠశాల అదనపు భవన నిర్మాణాలు పూర్తి అవ్వడానికి నిధులు మంజూరు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే కళాను సన్మానిస్తున్న గద్దే

చీపురుపల్లి: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి ఆదివారం చీపురుపల్లి చేరుకున్న కిమిడి కళావెంకటరావుకు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ముందుగా ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, పార్టీ మాజీ ఇన్‌చార్జి కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు కళాను ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, వెన్నె సన్యాసినాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, సారేపాక సురేష్, గద్దే అనురాగ్, రాజాం తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, కోట్ల కృష్ణ తదితరులు స్వాగతం పలికారు. డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, సీఐ సీహెచ్.షణ్ముఖరావు, చీపురుపల్లి, గరివిడి, బుదరాయవలస, ఎస్ఐలు కె.కిరణ్‌కుమార్‌నాయుడు, దామోదరరావు, లోకేష్, ఇంటిలిజెన్స్ ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, సిబ్బంది, స్పెషల్ బ్రాంచి హెచ్‌సీ సురేష్, ఎంపీడీవో డి.శ్వేత, ఈవోపీఆర్డీ కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవి, ఏవో ప్రవీణ్, సిబ్బంది, తహసీల్దార్ ఎస్.సురేష్, డీటీ సంతోష్ తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతి అభివృద్ధికి సాయం

గుర్ల: అమరావతి అభివృద్ధి కోసం తన వంతు సాయంగా ప్రతి ఏడాది రూ.25వేలను సీఎం చంద్రబాబుకు అందజేయనున్నట్టు టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కరిమినెల్లి బంగారునాయుడు తెలిపారు. ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును చీపురుపల్లిలోని తన గెస్ట్‌హౌస్‌లో ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, ఈ విషయాన్ని తెలియజేశారు. వారం రోజుల్లో తనతోపాటు అమరావతి వచ్చి సీఎంకు ఈ మొత్తాన్ని అందజేయాలని కోరారు.

చంద్రబాబును కలిసిన తెలగ సంక్షేమ సంఘం

చీపురుపల్లి: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబును జిల్లా తెలగ సంక్షేమ సంఘం నాయకులు కలిసి, వినతిపత్రం సమర్పించినట్టు ఆ సంఘం జిల్లా ప్రతినిధి సర్విశెట్టి వెంకటేశ్వరావు ఆదివారం తెలిపారు. గతంలో ఉన్న రిజర్వేషన్లు కక్ష పూరితంగా తొలగించడం వల్ల తెలగ జాతి పూర్తిగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయిందని, తమ వినతిపత్రంలో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని తమకు రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరినట్టు వెంకటేశ్వరావు తెలిపారు.

గాంధీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: కొండగుంపాం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని హెచ్ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన వాసవీ క్లబ్ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కల్వ హరికృష్ణ, జి.ఇందిర, సీహెచ్.మురళీకృష్ణ, ఒబ్బిలిశెట్టి సత్యనారాయణ, రామ్‌జీ, జనార్ధనరావు, సర్పంచ్ పతివాడ అప్పన్న, గ్రామ పెద్దలు రామారావు, శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలకు ప్రింటర్‌ను సమకూరుస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ సంఘం నాయకుడు శ్రీరాములు

నెల్లిమర్ల: జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ (సీపీడబ్ల్యూఎస్) కాంట్రాక్ట్ వర్కర్ల వేతనాలను ప్రభుత్వం పెంపుదల చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆదివారం రామతీర్థంలో జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నెలల తరబడి జీతాల బకాయి ఉన్నాయని, తమ బకాయి జీతాలను వెంటనే విడుదల అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అలాగే గత ఎనిమిది సంవత్సరాలుగా కాంట్రాక్ట్ వర్కర్ల జీతాలు పెంపుదల చేయకపోవడం దారుణమని అన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ చేపట్టాలి

జియ్యమ్మవలస: మండలంలోని కుందర తిరువాడ పంచాయతీల్లోజరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలు చోటుచేసున్నాయని, వాటిపై విచారణ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శ కొల్లి గంగునాయుడు కోరారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కుందర తిరువాడ పంచాయతీలో అధికారులు అనేక అక్రమాలు చేశారని, పంచాయతీలో లేని పేర్లు, వేరే గ్రామాల ప్రజల పేరున కొన్ని లక్షల రూపాయలు బిల్లులు చేశాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ చుట్టాల పేరున బిల్లులు చేశారని, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యుల పేరును బిల్లులు చేసుకున్నారని తెలిపారు. 2021 సంవత్సరం నుంచి కొన్ని లక్షల రూపాయలు బిల్లులు చేసుకున్నారని, ఇన్నేళ్లుగా అవినీతి జరుగుతుంటే మండల ఉపాధి అధికారులు, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, ఇతర అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇప్పటికైనా ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సీతంపేటలో వర్షం



సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట: సీతంపేటలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక ఎండ తీవ్రత అధికంగా ఉండడం, నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్న తరుణంలో వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది. అదే విధంగా వరి విత్తనాలు జల్లినప్పటికీ వర్షం లేకపోవడంతో మొలకెత్తని పరిస్థితి నెలకొంది.

జీసీసీ స్టాల్స్ పరిశీలన



జీసీసీ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఉన్న గిరిజన సహకార సంస్థ స్టాల్‌ను ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. గిరిజన సహకార సంస్థ ద్వారా గిరిజనం నుంచి సేకరించిన అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తులను పరిశీలించారు. వీటి తయారీ అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. జీసీసీ గిరిజన బ్రాండ్‌తో తయారు చేస్తున్న తేనె, సీకై పౌడర్, టర్మరిక్ పౌడర్, అలోవెరా, పసుపుతో తయారుచేసే సబ్బులు కూడా పరిశీలించారు. అరకు కాఫీ, వీటి అమ్మకాలను జీసీసీ మేనేజర్ కృష్ణ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీసీ సూపరింటెండెంట్ సాంబశివరావు, సేల్స్‌మేన్లు ఉన్నారు.

ఆదర్శప్రాయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ



పార్వతీపురంటౌన్: ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం, గరుగుబిల్లిలో..

పార్వతీపురంటౌన్: బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నేటి తరానికి చెందిన రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయులని పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక బైపాస్ రహదారిలోగల బీజేపీ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్‌ను నిర్వహించారు. ముందుగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ● **వీరఘట్టం:** వీరఘట్టంలో ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ త్యాగాన్ని స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి గుణుపూర్ వెంకటనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్థంతిని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ మండల ప్రతినిధులు టి.రాము, పి.అశోక్‌కుమార్, అమృతలింగం, నాగేశ్వరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

స్పీకర్‌కు అభినందనలు



గంట్యాడ: స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి కొండపల్లి, గరుగుబిల్లి: అభినందిస్తున్న పురుషోత్తంనాయుడు

గంట్యాడ: ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి రాష్ట్ర చిన్న, మధ్య తరహా, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ● **గరుగుబిల్లి:** రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా నియమితులైన చింతకాయల అయ్యన్నపాత్రుడును టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకు వెళ్లానని చెప్పారు. నియోజవకర్గం అభివృద్ధికి తనవంతు కృషి సహకారం అందిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారని చెప్పారు. బీసీలకు సంబంధించిన పథకాల పునుద్ధరణపై స్పీకర్‌తో పాటు మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.

తూర్పు కాపు సామాజిక వేదికలో నెల్లిమర్ల పెద్దలు

నెల్లిమర్ల: తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా కమిటీలో నెల్లిమర్ల మండలానికి ప్రాధాన్యం లభించింది. విజయనగరంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గం ఎన్నికలో కమిటీ అధ్యక్షుడిగా ఒమ్మి గ్రామానికి చెందిన అంబళ్ల అప్పలనాయుడు, గౌరవ అధ్యక్షుడిగా వల్లూరు పంచాయతీ బొడ్డపేటకు చెందిన కడగల ఆనంద్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరిద్దరిని పలువురు అభినందించారు.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపు

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వృద్ధులు, వితంతువులకు పింఛను రూ.3 వేలు నుంచి రూ.4 వేలు పెంచిన కారణంగా పింఛనుదారుల్లో ఆనందం కనిపిస్తుంది. గుమ్మలక్ష్మీపురం మండలంలో 6,770 మంది పింఛనుదారులు కొత్త పింఛను కోసం ఆనందంతో ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఒక్కసారిగా రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచడం గొప్ప విషయంగా కొనియాడుతున్నారు. ఇంటింటికి పింఛను పంపిణీ చేస్తామని ప్రభుత్వం నిర్ణయించడంతో మరింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల పంపిణీ

గంట్యాడ: మండలంలోని రేగుబిల్లి, బురదపాడు గ్రామాల్లో ఆదివారం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, ఆయా గ్రామ పెద్దల సమక్షంలో రైతులకు విత్తనాలు అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గరుగుబిల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ వై.అమ్మన్నరావు హెచ్చరించారు. మండలంలోని ఎర్రన్నగుడి, ఖడ్గవలస సముదాయంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో యజమానులు నిబంధనలు పాటించాలన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినట్లయితే సమాచారం అందించాలని కోరారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



భోగాపురం, పాలకొండ: లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బంగార్రాజు, తేజోవతి

భోగాపురం: మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ● **పాలకొండ:** రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తేజోవతి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. మంగళగిరిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈసందర్భంగా లోకేశ్. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

మొక్కులు తీర్చుకున్న నాయకులు



దుర్గగుడిలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యేగా నిమ్మక జయకృష్ణ గెలిచిన సందర్భంగా బీసీ కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోటదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరఘట్టం పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొమరాడ: కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యాలో సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వద్ద ఆత్మీయంగా కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులకు సన్మానించారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఇలా ఉంటే రోగాలు రావా?

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంది. మండల కేంద్రంలో ప్రధాన రహదారులు, కార్యాలయాలకు ఆనుకుని, అలాగే రావుపల్లి ప్రధాన వీధులతో పాటు ఎస్సీ కాలనీలో మురుగు నిల్వలు పేరుకుపోయాయి. గత రెండేళ్లుగా మురుగు నిల్వలు తొలగించలేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో దోమలు బెడద అధికంగా ఉందని వాపోతున్నారు. వ్యర్థాలు, దుర్గంధం కారణంగా పలువురు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అధికమైతే డయేరియాతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి మురుగు నిల్వలు తొలగించాలని కోరుతున్నారు.



రావుపల్లి ఎస్సీ కాలనీలో మురుగు నిల్వలు

జగన్ ధన దాహానికి అంతం లేదా?

- రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి



సాలూరు: జగన్ ధన దాహానికి, ప్యాలస్‌ల పిచ్చికి అంతం లేకుండా పోయిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశుసంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆమె ఆదివారం స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ పార్టీ ఆఫీసుల పేరుతో అక్రమ కట్టడాలు నిర్మించారని అన్నారు. అక్రమ కట్టడాలు ఉంటే కొట్టేయాలని ఆనాడు చెప్పిన జగన్‌రెడ్డి నేడు ప్రతిపక్ష నేత కాకపోయినా ప్రభుత్వం, కోర్టులు ఆయన కోరికను తీరుస్తున్నాయని అన్నారు. జనం నుంచి దోచుకున్న రూ.500కోట్లతో ప్యాలస్‌లు కట్టుకున్నావని ఆమె ఆరోపించారు. ఈ ప్యాలస్‌ల పిచ్చి ఏంటని ఆమె ఎద్దేవా చేశారు. 11 సీట్లు వచ్చినా బుద్ధి రాలేదా అని విమర్శించారు.

పెరిగిన జీడిపిక్కల ధర



సీతంపేట: మన్యంలో జీడిపిక్కల ధర భారీగా పెరిగింది. ప్రస్తుతం కిలో జీడిపిక్కలు రూ.163 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎన్నికల ముందు కిలో జీడిపిక్కలు రూ.80 రూ.100 ధరకు వ్యాపారులు కొనుగోలు చేయగా ప్రస్తుతం మార్కెట్‌లో జీడిపిక్కలకు మంచి డిమాండ్‌ఉండడంతో వాటి ధర రెండెంతలు పెరగడంతో నిల్వ ఉంచుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా జీడిపిక్కల ధర పెరగడం కష్టానికి ఫలితం దక్కుతుందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటికే 80 శాతం వరకు రైతులు తమ వద్ద ఉంచిన జీడిపిక్కలను ఇంటి అవసరాలు నిమిత్తం తక్కువ ధరకు అమ్మకాలు చేయడం, ప్రస్తుతం జీడి ధర పెరగడంతో కొంతమంది గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు నుంచి కొనుగోలు చేసి వ్యాపారులు పెద్ద ఎత్తున నిల్వాలు ఉంచడంతో ధర పెరగడం వ్యాపారులకు కలిసి వచ్చింది. ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

పాలకొండ: వీరఘట్టం మండలంలోని పనసనందివాడ గ్రామానికి చెందిన బొచ్చ కల్యాణ్ అనే నిరుపేద విద్యార్థికి పాలకొండకు చెందిన దిలీప్‌కుమార్ ఆదివారం తన మిత్రులతో కలిసి రూ.8వేలు ఆర్థిక సాయం అందజేశారు. కోనాడ సూర్యనారాయణ మాస్టార్ ద్వారా కల్యాణ్ ఆర్థిక స్థితిని తెలుసుకుని, తన చదువు కోసం ఆర్థిక సాయం చేశామని చెప్పారు.

ఎస్ఐని కలిసిన జనసేన నాయకులు

వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎస్‌కే ఫక్రుద్దీన్ మెడికల్ లీవ్‌తో వెళ్లడంతో జి.కళాధర్ ఎస్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈయనను ఆదివారం స్థానిక జనసేన నాయకులు జానీ, మత్స పుండరీకం, సరిపల్లి అచ్యుత, సాయి పవన్, చరణ్, దత్తి గోపాల్ తదితరులు కలిసి అభినందించారు.

పందుల నిర్మూలనకు చర్యలు తీసుకోండి

- గజపతినగరం, పురిటిపెంట వాసుల డిమాండ్



పురిటిపెంటలో పందుల సంచారం

గజపతినగరం: తమ గ్రామాల్లో పందుల నిర్మూల నకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గజపతినగరం, పురిటిపెంట గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ పం చాయతీల్లో పందుల సంఖ్య రోజురోజుకు ఎక్కువ తోంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారం భం కావడంతో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. కానీ తమ గ్రామాల్లో పందుల నిర్మూల నకు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని ఆ రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పందుల కారణంగా ఎటువంటి వ్యాధుల బారిన పడాల్సి వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. పందుల సంచారంతో చికెన్ గునియా, మలేరియా, స్వైన్‌ఫ్లూ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రెండు గ్రామ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.